

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## అన్నయ్య

**మనం పుట్టకముందే వచ్చి ఈ లోకంలోకి** ఆటలూ పాటలూ నేర్చుకుని, అమ్మా నాన్నల ముద్దులూ, దెబ్బలూ రుచి చూసేసి, అల్లరి చెయ్యడానికి తోడు కోసం ఎదురు చూసే తోబుట్టువు అన్నయ్య.

మా అమ్మ చెప్పేది ''నీకు చెల్లెలు పుడుతుందిరా'' అన్నప్పుడల్లా ''ఇప్పుడొద్దు.. నాకు పరిక్షలు'' అనేవాడట మా అన్నయ్య. నేను పుట్టాక, పరీక్షలూ, గాలిపటాలూ, స్నేహితులూ అన్ని పక్కన పెట్టి ఉయ్యాల చుట్టూ తిరుగుతూ ''నా చెల్లి.. ఎవరూ ఎత్తుకోవద్దు'' అని కాపలా కాసేవాడట! అప్పటిదాకా పెద్దమ్మ పిల్లలు తప్ప స్వంత చెల్లెలు లేని అన్నయ్య కిరీటం వచ్చినంత ఆనందంగా ''అన్న అను.. అ..న్న..'' అని నా పక్కన కూర్చుని నేర్పిస్తుండేవాడట. బడికి దిగులుగా వెళ్ళేవాడట, ఎవరైనా తను లేనప్పుడు చెల్లెల్ని ఎత్తుకెళ్ళిపోతారేమోనని!



అమ్మ, అన్నయ్య, నేను

నేను అక్షరాలు దిద్దేవేళ నా బలపం చివర నా చెయ్యి వంకరపోకుండా పట్టుకున చెయ్యి 'అన్నయ్యదే!'

నేను అన్నం తినకపోతే అమ్మ కొడుతుందని తెలిసి, నా కంచంలోదీ, తన కంచంలోదీ తినేసి ఎక్కసం అయి బాధపడినదీ వాడే!

నేను పెంకితనాలు పోయి ''అన్నయ్యకి ఎన్ని చెంచాల నెయ్యి వేసావో చెప్పు.. అంతకన్నా ఎక్కువ కావాలి..'' అని ఏడుస్తుంటే ''నా అన్నం నీకిచ్చి, నీ అన్నం నే తింటా'' అని ఓదార్చినవాడూ వాడే! నేను వీపు మీద ఎక్కి గుర్రపు ఆట ఆడడానికి జుట్టు దొరకక ఏడిస్తే పొడుగ్గా పెంచాలనుకున్నదీ పాపం వాడే! నాకు ఎవరి మీద కోపం వచ్చినా వాడి వీపు మీద గిచ్చేసి కొరికేస్తుంటే, అమ్మతో చెప్పకుండా పళ్ళు బిగబట్టి భరించిందీ వాడే, నాకు లెక్కలు రాక తక్కువ మార్కులొస్తే, అందరూ పడుకున్నాక దీపం వెలుగులో తెల్లవార్లూ లెక్కలు చేసి కరెక్ట్ సమాధానాలు తెచ్చిందీ వాడే!.. నాకు సైకిల్ తొక్కడం నేర్పించి, నా మోకాళ్ళు చెక్కుకుపోతే, కొబ్బరి నూనె రాస్తూ ఏడ్చిందీ వాడే!

చందమామ, బాలమిత్రా చదివి "మంత్రపు సంచీ, మాయ తివాచీ దొరికితే చెల్లీ నీకు బోలెడు పట్టులంగాలూ, బొమ్మలూ తెచ్చిస్తా" అని చీపురు పుల్లల బాణాలతో ప్రతిజ్ఞలు చేసిందీ వాడే! నేను స్కూల్లో చేసిన అల్లరి పనులకీ, తెచ్చుకున్న తక్కువ మార్కులకీ టీచర్లూ, హెడ్ మాస్టర్ పిలిచి తిడితే తలొంచుకుని నిలబడ్డదీ వాడే!

"నువ్వు మురళీ చెల్లెలివా? వాడు చూడు ఎంత బుద్ధిమంతుడో.. ఎంత బాగా చదువుకుంటాడో!" అని స్కూలో తిట్టినప్పుడల్లా నేను వాడిని వంగదీసి వీపుమీద కొడుతుంటే, "నేనేం చేసాను? నన్నెందుకు కొడతావు?" అని ఒక్కసారీ అడిగేవాడు కాదు!

అమ్మమ్మ పటిక బెల్లం నేను కాజేసినా, అమ్మ బ్యాగ్ లోంచి పావలా బిళ్ళలు మాయం అయినా, నాన్న వచ్చే టైంకి ఇల్లంతా కాయితాలు చింపిపోసినా, పక్కవాళ్ళ జామచెట్టు ఎక్కి కాయలన్నీ కోసేసినా, ఎవరి సైకిల్ అయినా సరే అడగకుండా తీసుకుపోయి దేనికో గుద్దేసినా, పళ్ళు పట పట కొరికి, అన్నీ తనమీద వేసుకునేవాడే కానీ నన్ను చెయ్యెత్తి కొట్టేవాడే కాదు. "చెల్లెల్ని ఏడిపిస్తే మళ్ళీ ఆసుపత్రిలో ఇచ్చేసి వస్తా" అన్న అమ్మ మాటలు గుర్తుకు తెచ్చుకుని భయపడేవాడట.

నాకు చింతపిక్కలు, ఒకటి ఎగరేసి, మిగతావి ఒడుపుగా పట్టుకోవడం నేర్పించిందివాడే నాతో గచ్చకాయలూ, తొక్కుడు బిళ్ళా ఆడి ప్రతిసారీ ఓడిపోయిందీ వాడే! నా కోసం కంచెల్లో దూరి వీపు అంతా గీరుకు పోయినా గోరింటాకు కోసుకొచ్చి, స్వయంగా రోట్లో రుబ్బి చేతుల్లో చందమామలూ, వేళ్ళకి టోపీలూ పెట్టి, నా పక్కన పడుకుని నేను ఒంటికి పూసుకోకుండా రాత్రల్లా చూసేవాడు.. కానీ వాడి చెంపలూ, చేతులూ పండిపోయి ఉండేవి.


పెద్దయ్యాక అన్నయ్య నేను

వాడు కోయవాడి వేషం వేస్తే, నేను సిగరెట్ పెట్టెలో ముచ్చితపు రేకులతో తాయెత్తులు చేసిస్తే, వజ్రవైఢూర్యాలు ఇచ్చినట్లు మురిసిపోయాడు. నేను మొదటిసారి ఉప్మా చేస్తే దాంట్లో ఉప్పు వెయ్యడం మరిచిపోతే, పక్కన పంచదార పెటుకుని, నన్ను పొగుడుతూ తిన్నాడు. నేను స్కూలో డాన్స్ చెయ్యాలంటే, జడ కుప్పెలు కోసం సైకిలేసుకుని ఎంత దూరమో వెళ్ళి అడిగి తెచ్చి జడవేసేవాడు. నేను కొత్త కొత్త తిట్లు నేర్చుకుంటే ముందుగా వాడి మీదే ప్రయోగిస్తే, "తప్పు.. ఇవి తిట్టొచ్చు.. ఇవి తిట్టకూడదు!" అని చెప్పిందీ వాడే!

మగపిల్లలంతా ఇంటి దగ్గర దిగుడు బావిలో ఈతలు కొడుతుంటే, "నేనూ ఈత కొడతా.." అని నేను కింద వెల్లకిల్లా పడికొట్టుకుంటూ ఏడిస్తే, నన్ను కళ్ళుతుడిచి, ఇంటికి తీసుకొచ్చి నీళ్ళ డ్రమ్ములో వేసి మళ్ళీ జడ మాత్రం తన చేతిలోనే పట్టుకుని ఈత కొట్టించిందీ వాడే!

మా అమ్మా, పెద్దమ్మలూ నన్ను ఏమార్చి సినిమాకి వెళితే, ఆ విషయం తెలిసి నేను కిందపడి తలబాదుకుని ఏడుస్తుంటే, లేపి సైకిల్ ఎక్కించుకుని వాళ్ళ బస్సులో వెళ్ళే కన్నా ముందే నన్ను సినిమా హాలుకి తీసుకెళ్ళి అక్కడ సిద్ధంగా నిలబెట్టిందీ వాడే!

నన్ను దేవదాసు సినిమాకి తీసుకెళ్ళి "ఆ అబ్బాయి షర్బత్ తాగుతున్నాడు.. సినిమా అంతా ఎంత నవ్వో! అంత నవ్వు" అని చెప్పి నవ్వించి నమ్మించిందీ వాడే! రోజూ రాత్రి అవగానే "రావే చెల్లీ కథ చెపుతాను" అని దుప్పటి గట్టిగా బిగించుకుని "డ్రాక్యులా" కథ మొదలుపెట్టి "నిన్ను అతను చూడాలనుకుంటే చూడగలడు... అతన్ని నువ్వు చూడలేవు!" అన్న ఒకే డైలాగ్‌తో "భయం వేస్తోంది.. మిగతాది రేపు చెపుతా.." అని సంవత్సరాల పొడుగూతా చెప్పి పూర్తి చెయ్యనిదీ వాడే!

వాడు ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళ్ళొచ్చి, పెరట్లో 'లొట్ట' వేసి చప్పుడు చేస్తే, అమ్మకి తెలీకుండా నేను తలుపు తీసి, అన్నం పెడితే బోలెడు కృతజ్ఞతతో, నేను ఏ తప్పు చేసి వాడితో చెప్పినా కవరింగ్ ఇచ్చుకుంటూ వచ్చినదీ, వాడే!

సిగరెట్ కాలుస్తూ మొదటి సారే నాకు పట్టుబడిపోయి ‘అమ్మకి చెపుతా‘ అన్న నా బ్లాక్ మెయిలింగ్‌కి లొంగిపోయి నేను ఏం అడిగినా తెచ్చి ఇచ్చినదీ వాడే సంక్రాంతి సమయంలో నా కన్నా ప్రొద్దుటే లేచి ఆవుపేడ తెచ్చి గొబ్బెళ్ళు చేసి నన్ను లేపేవాడు. బొమ్మలు పెట్టుకుంటే, ఐస్ క్రీమ్ పుల్లలతో సినిమా హాలూ, పార్కులూ, గుళ్ళూ అన్నీ తయారు చేసేవాడు.

అస్సాంలో ఉద్యోగం వచ్చి వెళుతూ నా చేత ‘గోరింటా పూచిందీ కొమ్మా లేకుండా‘ అని పాడించుకుని టేపు చేసుకుని తీసుకెళ్ళాడు. నేను ఇంటర్‌మీడియట్ పరీక్షలు పాసయి గౌహతి వాడి దగ్గరకి వెళితే, "మీరేనా మురళీ చెల్లెలు.." అని చూసిన ప్రతివాళ్ళూ అడిగారు. వాడి ఇంటికొచ్చిన ప్రతివాళ్ళకీ లంగా ఓణీలో నా పదహారేళ్ళ వయసులో ఉన్న ఫోటో చూపించాడు. ప్రతి తెలుగువాళ్ళూ ఇంటికి పిలిచి ‘గోరింటా పూచిందీ పాడండి..‘ అన్నారు. ఆ పాట తెలుగు రాని అస్సామీ, కలకత్తా, నాగాలాండ్ లేబర్‌కి కూడా వినిపించేసాడు!

"ఒరేయ్ నీతో చదువుతాడు చూడు.. తెల్లగా పొడుగ్గా అట్లకాడలా ఉంటాడు.. వాడు సిగరెట్లు తాగుతాడు. నన్ను చూసి నవ్వుతూ మరీ కాలుస్తాడు. వాడితో మాట్లాడకు" అని ఓసారి కంప్లైంట్ చేసాను.

ఆ అట్లకాడే "మీ చెల్లెల్ని నేను పెళ్ళి చేసుకుంటారా!" అని అడిగితే, బాగా ఆలోచించి దీర్ఘంగా మా అన్న ఓ లెటర్ రాసాడు "అది అల్లరి చేస్తుంది. కొంచెం కోపం ఎక్కువ.. అప్పుడప్పుడూ చెయ్యి చేసుకుంటుంది.. ఉడుకుమోతుతనం ఎక్కువ... సతాయిస్తుంది.. మొండి పట్టుదల ఎక్కువ.. కానీ మంచిపిల్ల! నేను ఏం చేసినా భరిస్తాను. నువ్వూ భరించేటట్లయితే చేసుకో.. నా పర్మిషన్ గ్రాంటెడ్" అని.

అలా అట్లకాడతో సారీ.. ప్రభాకర్‌తో నా పెళ్ళి చేయించాడు!

నేను మొదటి కథ రాసినప్పుడూ, నా మొదటి సీరియల్ టీ.వీ.లో వచ్చినప్పుడూ, నా నవల సినిమా అయినప్పుడూ.. నాకు ‘నంది‘ అవార్డు వచ్చినప్పుడూ.. అప్పుడూ .. ఇప్పుడూ, ఎంతో గర్వపడుతూ, సంతోష పడుతూ, నా పేరు చెప్పి ‘బలభద్రపాత్రుని రమణి తెలుసా? నా చెల్లెలు‘ అని చెప్పుకునే మా అన్నయ్యకి.. ఏం ఇచ్చినా తక్కువే ... రాఖీ పండుగ సందర్భంగా.. ఈ అక్షరసుమాలు ప్రేమతో సమర్పిస్తున్నాను.... !!

**NEW**
Click here to share your comments on this story